**Dawat-e-Huq Aur Ghair Muslim**
**(Telugu)**

# సత్యసందేశం ముస్లిమేతరులు

మూలం

**మతీన్ తారిఖ్ బాగ్‌పతీ**

అనువాదం

**ఇఖ్బాల్ అహ్మద్**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.ఫోన్:24564583



**Satyasandesham- Muslimetarulu**
**Dawat-e-Huq Aur Ghair Muslim (Telugu)**

**TIP Series No. : 168**

Written by : Mateen Tariq Baghpati
Translated by : Iqbal Ahmed

All Rights Reserved with Publishers

First Edition : February 2007

Copies : 2000

**Price : Rs. 12**

ISBN : 81-88241-69-5

Published by : **Telugu Islamic Publications Trust**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

*అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

# సత్యసందేశం - ముస్లిమేతరులు

ఈ పుస్తకం శీర్షిక కల్పితమయిన అంశం కాదు, ఇదొక స్వాభావిక అంశం అనేది అందరికీ తెలిసిన విషయమే. మనం ముస్లిమేతర ప్రజలు కూడా వున్న జనావాసాలలో నివసిస్తున్నాం. వారు మన పొరుగువారు, శతాబ్దాలుగా మనకూ వారికీ సంబంధాలు వున్నాయి. మనకు వారికి వర్తక వ్యాపారాల్లో, ఇచ్చిపుచ్చుకోడాలు, పరస్పర సంబంధ వున్నాయి. అటువంటి మన సోదరులకు ఇస్లాం సందేశాన్ని అందించడం మన విధి.

అయితే ఈ అంశంపై మాట్లాడేముందు కాస్త మనం మన హోదాపై కూడా దృష్టిసారించవలసివుంది. అప్పుడే ఈ విషయం ఆలోచించడానికి, అర్థం చేసుకోడానికి, దానికనుగుణంగ పనిచేయడానికి సౌలభ్యం కలుగుతుంది.

అల్లాహ్‌కు అపారమయిన కృతజ్ఞతలు. మనం ముస్లిములయి అల్లాహ్ మమ్మల్ని ఆయన సందేశానికి అమానతుదారులు (ట్రస్టీలు)గా చేశాడు. మనం ఒక ఉత్తమ సమాజం అంటూ, ఆయన మన హోదాను నిర్ణయిస్తూ సెలవిచ్చాడు.

**"కున్‌తుమ్ ఖైర ఉమ్మతిన్ ఉఖ్రిజత్ లిన్నాసి త'మురూన బిల్ మారూఫి వ తన్‌హౌన అనిల్ మున్‌కరి వ తూమినూన బిల్లాహ్." (ఆలిఇమ్రాన్: 110)**

"ఇకనుండి ప్రపంచంలో మానవులకు మార్గం చూపటానికీ, వారి సంస్కరణకూ రంగంలోకి తీసుకురాబడిన ఉత్తమ సమాజం మీరే."

అంటే మనం ప్రపంచంలోని ఉత్తమ సమాజం. మంచిని వ్యాపింపచేసే పని చేయడం, చెడునుండి ఆపడం, అల్లాహ్‌పై విశ్వాసం కలిగివుండటం మా కర్తవ్యం.

మంచిని వ్యాపింపచేయడం, చెడును రూపుమాపడం అంటేనే ఒక గొప్పపని. దానికి ఒక ప్రదేశం పరిస్థితులు అంటూ నియమం ఏదీలేదు. విశ్వాసి అయినవాడు ఎక్కడున్నా ఏ ప్రదేశంలో వున్నా, ఎప్పుడు చేయగలిగినా ఆ పనిచేయాలి. నిరీశ్వరవాదం, దిగంబరత్వం, అసత్యం, దుర్వినియోగం, మోసం, కపటం, వడ్డీ, లంచం హింసాదౌర్జన్యాలు అన్నీ షైతానీపనులు. అవి మానవ సమాజాన్ని చీడపురుగుల్లా భక్షిస్తాయి. ఈ రోగాలు సమాజంలో తలెత్తితే మనిషి సుఖశాంతులను కోల్పోతాడు. అందువలన అల్లాహ్ ముస్లింలను సంబోధిస్తూ ఒకచోట సెలవిస్తున్నాడు.



**"వల్‌తకుమ్మిన్‌కుమ్ ఉమ్మతున్‌య్యద్‌ఊన ఇలల్‌ఖైరి వ యమురూన బిల్ మారూఫి వయన్‌హౌన అనిల్ మున్‌కర్. వ ఉలాయిక హుముల్ ముఫ్లిహూన్" (ఆలిఇమ్రాన్: 104)**

"మీలో మంచివైపునకు పిలిచేవారూ, మేలుచెయ్యండి అని ఆజ్ఞాపించే వారూ, చెడునుండి వారించే వారూ కొందరు తప్పకుండా ఉండాలి. ఈ పనిని చేసేవారే సాఫల్యం పొందుతారు."

అంటే మీరు ప్రజలను మేలువైపు పిలుస్తూ ఉండటంలో ఇంకా వారిని చెడుపనులకు దూరంగా ఉంచడంలో, దైవదాసులకు దైవసందేశం అందించడంలోనే మీ శ్రేయస్సు, మీ విజయం వృద్ధివికాసాలు ఆధారపడి ఉన్నాయి. ఇదే మీ జీవిత లక్ష్యం. ఇదే మీ యొక్క విలక్షణమైన ఘనత. మీరు గనక అలాచేయకపోతే ఈ విలక్షణ ఘనత నిలబడదు. దైవప్రవక్త(స) హదీసు ఈ పనివైపే సూచిస్తోంది.

"ఒకరు తప్పుపని చేస్తుండటాన్ని మీరు చూసినట్లయితే, అతడ్ని ఆ పనినుండి దూరంగా ఉంచే ప్రయత్నం చేయండి, అది మీపై వాజిబ్ అవుతుంది. ఇలా చేయనివాడు మాలోని వాడు కాదు."

అంతేకాక అల్లాహ్ ఆగ్రహం అతడ్ని చుట్టుముట్టవచ్చు. తిర్మిజీ గ్రంథంలో దైవప్రవక్త(స) ఇలా సెలవిస్తుండగా విన్నానని హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(రజి) ఉల్లేఖించారు.

"ప్రజలు ఏదయినా పాపాన్ని చూసినప్పుడు, దాన్ని నిరోధించే ప్రయత్నం చేయకపోయినట్లయితే వారు ఏదయినా కఠినశిక్షకు గురికావడంలో ఆశ్చర్యం లేదు."

శ్రద్ధాసక్తులతో ఆలోచించే వారికి ఈ హదీసులో గొప్పగుణపాఠం, హిత బోధ వుంది. ఈనాడు సమాజంలో ఎటుచూసినా కల్లోల పరిస్థితులు విలయ తాండవం చేస్తున్నాయి. దిగంబరత్వం, లైంగిక విశృంఖలత్వం పెరిగిపోతోంది. ఇచ్చిపుచ్చుకోవడాల్లో, పరస్పర సంబంధాల్లో, వ్యాపారంలో, రాజకీయాల్లో

అన్నిచోట్ల వంచన, మోసం కానవస్తున్నాయి. లంచం, వడ్డీ, సారాయి, నగ్న, అర్ధనగ్న నాట్యప్రదర్శనలకు స్వేచ్ఛ ఇవ్వడమయింది. జాతీయతల బంధనాల్లో మానవత్వం నలిగిపోతోంది.

ఇటువంటి సమయంలో, మనం ఎక్కడున్నా, ఏ ప్రాంతంలో వున్నా ఎవరి మధ్య జీవితం గడుపుతున్నా, అక్కడే మన శక్తికొద్దీ ఆ పరిస్థితులను మార్చే ప్రయత్నం చేయడం మన విధి. దైవదాసులకు దైవసందేశాన్ని అందించాలి. కాని గుర్తుంచుకోండి! ఈ పని ముస్లింలకే ప్రత్యేకించుకోకూడదు. హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, పార్శీలు, బౌద్ధులు, జైనులు ఇంకా ఎవరైనా సరే, మానవతపరంగా మన సోదరులే. ఆదం సంతానమే. మానవులు, పశుపక్ష్యాదులు, జంతుజాలం, వగైరా అందరూ ఎవరి అనుగ్రహం వల్ల పోషించబడుతున్నారో, ఆ సకలలోక ప్రభువుకు దాసులే. కనుక ప్రతి దాసుని విషయంలో మన హృదయంలో చిత్తశుద్ధి కలిగి ఉండటం అవసరం. ఈ చర్య అతడి కోసమే కాక మనకు సాఫల్యదాయకం కాగలదు.

మన చుట్టుప్రక్కల ప్రాంతంలో నిప్పు అంటుకున్నప్పుడు, మా ఇల్లు భద్రంగా వుందిలే అని మనం హాయిగా కూర్చోవడం సరయిన పని కాదు. వేడిగాలి ఒక్కసారి వస్తే, ఆ మంట మొత్తాన్ని నాశనం చేస్తుంది. అదేవిధంగా ఈనాటి చెడుగులకు మీరు, మనకు వాటితో పనేంటి, మనం మంచివాళ్ళం. మనం బాగానే వున్నాం, చెడుపనులకు దూరంగా వున్నాం, ప్రపంచంలో అసత్యం సర్వసామాన్యమయిపోతుంటే, తూకాలు కొలతలలో తక్కువ చేయబడుతుంటే, దొంగతనాలు జరుగుతూవుంటే పొరుగువారిలో నిర్లజ్జతనం పెరుగుతూ వుంటే పోతేపోనీయండి ఏమయితే మనకెందుకు అని భావిస్తూ చేతులు ముడుచుకుంటే ఇది శుభసూచకమయిన విషయం కాదు. దుష్కార్యాల రోగం బహుచెడ్డ రోగం. ఇది, ఒక దేశం, ఒక జాతి, ఒక నగరంలో నివసించే వారిని గనక పట్టుకుంటే వారిని నిర్వీర్యులు చేసివేస్తుంది. మనిషిలో దురాశ, అహంకారం, స్వార్థాల భూతం ఆవహిస్తే అతడు ఏమిచేసినా తక్కువే. నమ్రూద్, ఫిరౌన్, షద్దాద్ ఇటువంటి పైశాచికత్వానికి నమూనాలు. వారి దుష్టస్వభావపు ఘనకార్యాలతో చరిత్ర నిండివుంది.



మానవులలో గల ఈ స్వభావం దృష్ట్యా, అల్లాహ్ ప్రతికాలంలోనూ ప్రవక్తలను పంపాడు. ప్రవక్తలు ప్రజలను పెడదారులు పట్టకుండా నిరోధించారు. దైవధర్మం వైపు పిలిచారు. ఈ పరంపరలోని చివరిప్రవక్త సయ్యిదినా ముహమ్మద్(స). ఇక ఆయన(స) తర్వాత మరే ప్రవక్తా రారు. ప్రపంచ ప్రజలకు సత్యసందేశం అందించే బాధ్యత ఆయన అనుయాయులపై పడింది. మీరే ఈ పని చేయవలసి వుంది. **'తామురూన బిల్ మారూఫి వతన్‌హౌన అనిల్ మున్‌కర్'** మంచిని ఆజ్ఞాపించి, చెడును త్రుంచే విధిని నిర్వహించే విషయం గురించి అంతిమ దినాన సంజాయిషీ ఇవ్వమని మనం అడగబడతాం.

## పరలోక సంజాయిషీ- మన బాధ్యత

కాస్త ఊహించండి. ఆ రోజు ఎంత కఠినమైనదో. సూర్యుడి తీక్షణత వల్ల పరిస్థితి దుర్భరంగా తయారవుతుంది. దైవపీఠం ఎదుట ఒక బోనులో మనం, రెండో బోనులో ప్రపంచమానవులు నిలబడి వుంటారు మీవరకు నా సందేశం అందజేయబడిందా? అని అల్లాహ్ వారిని ప్రశ్నిస్తాడు. వారు, ఓ ప్రభూ! నీ సందేశం మాకు అందచేయబడలేదు అంటారు. ఎదుటవున్న ఈ ఫలానా వ్యక్తి నీ సందేశాన్ని మాకెన్నడూ వినిపించలేదు. ఈ వ్యక్తి ఇల్లు మా పొరుగునే వుండేది. వ్యాపార విషయాల్లో ఈయన మమ్మల్ని కలిసేవాడు. కాని నీ ధర్మం ఏమిటో జీవితం గడపడానికి నీవు అవతరింపజేసిన విధానమేమిటో ఈయన మాకు తెలుపనేలేదు. నీవు అవతరింపజేసిన గ్రంథాన్ని కూడా ఈయన ఎన్నడూ మాకుచూపలేదు. మరి ఓ ముస్లింలారా! అప్పుడు ఈ ప్రశ్నకు మీరు ఏమి జవాబిస్తారు? అక్కడ నుండి ఎలా తప్పించుకుంటారు?

అంతిమ దినంపై మనకు విశ్వాసం వుంది. ఆ రోజున సంజాయిషీ అడగబడటం తథ్యం. సత్యవాక్కును ఉన్నతం చేయడం కూడా ముస్లింల జీవిత ప్రథమ విధి. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొని మానవులందరికీ దైవసందేశం అందించడం మన అందరి విధి. ప్రత్యేకించి మన సమీపంలోని ముస్లిమేతరులకు సత్యసందేశం అందించాలి. వారిపట్ల మనకు గల హక్కును నెరవేర్చాలి. దివ్యఖుర్‌ఆన్‌లో వుంది.

**"యా అయ్యుహన్నాసుత్తఖూ. రబ్బకు ముల్లజీ ఖలఖకుమ్మిన్ నఫ్సిన్**

**వ్వాహిదతిన్వ్వ ఖలఖమిన్హా, జౌజహా వ బస్సమిన్హుమా రిజాలన్ కసీరన్వ్వ నిసాఅ. వత్తఖుల్లాహల్లజీ తసాఅలూన బిహీ వల్ అర్హామ్. ఇన్నల్లాహకాన అలైకుమ్ రఖీబా. (నిసా: 1)**

**అనువాదం:** మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణినుండి పుట్టించాడు. అదే ప్రాణినుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంటద్వారా ఎంతోమంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను తెంచటం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి.

ఈ ఆయత్లో మనల్ని ఒకవైపు అల్లాహ్కు భయపడమని, అతడి ఆగ్రహాన్నుండి తప్పించుకోండని తాకీదు చేయబడుతోంది. మరొకవైపు మానవు లందరూ ఒకే మూలానికి చెందినవారనీ ఒకరు మరొకరికి రక్తమాంసాల వంటి వారని, వారి హక్కులు మనపై వున్నాయని, వాటి విషయంలో మనం జాగరూకులై వుండాలని లేకపోతే మనల్ని సంజాయిషీ అడగడం జరుగుతుందని మనకు గుర్తు చేయబడుతోంది.

## ముస్లిమేతరులతో సంబంధాల వైఖరి

ముస్లిమేతర సోదరులు మనతో మానవీయ సంబంధం కలిగి వున్నారు. వారి విషయంలో మన ఆలోచనా విధానం మారాలి. వారితో మన సంబంధ బాంధవ్యాలు ముక్తసరిగా వున్నాయన్న విషయాన్ని మనం ఒప్పుకోవాలి. కొద్దోగొప్పో సంబంధాలు ఉన్నప్పటికీ వాటిలో గాఢత్వం, ఉత్సాహాలలో లోటువుంది. వారిని మనం, మనపై అలిగిన సోదరులుగా భావించవలసి వుంది. కుల, మత వివక్షత లేకుండా వారికి సేవచేయాలి. వారితో విస్తృతస్థాయిలో నిస్వార్థపర సంబంధాలు నెలకొల్పుకోవాలి. సోదరత్వం, అభిమానం, సానుభూతి, శ్రేయోభిలాషతో కూడిన మనస్తత్వం కలిగి ఉండాలి.

## దేశీయ, అనువంశిక సంబంధం

ముస్లిమేతరులతో మనకు మానవీయ సంబంధం అయితే వుంది. దానితోపాటు వారితో దేశీయ సంబంధం వుంది. ఇంకా వారిలో చాలా మందితో వంశపరమైన సంబంధమూ ఉంది. ఈ విషయాలన్నీ మనల్ని కోరేది ఏమంటే, మనం వారి శ్రేయస్సు విషయంలో ఆలోచించాలి, వివాహాల సందర్భంగా, విచారకర సంఘటనల సందర్భంగానూ వీలు కల్పించుకుని వారి వద్దకు వెళ్ళాలి. సంతోష సమయాలలో స్తోమతను బట్టి బహుమతులు, కానుకలు ఇచ్చి, దుఃఖకర సందర్భాలు అంటే మరణం, వ్యాధి, అత్యవసర పరిస్థితులలో సానుభూతి వచనాలు పలుకుతూ సాధ్యమైనంతమటుకు సపరిచర్యలు, ఆర్థిక సహాయం అందించడానికి సిద్ధంగా వుండాలి. ఈ విధంగా మనకంటే ఎక్కువ సానుభూతిపరుడు వారికి ఎవరూ లేరని, మనకన్నా మరో శ్రేయోభిలాషి వారికి ఎవరూ లేరని వారి అనుభవంలోకి రావాలి. సేవ, సద్వ్యవహరణ, శ్రేయోభిలాషా పరత్వం వగైరాలు అపూర్వమయిన ప్రభావం కలిగి ఉంటాయి. కఠినాతికఠిన శత్రువు కూడా వాటిముందు లొంగిపోతాడు. రాతిగుండెలు సైతం మైనంలా కరిగిపోతాయి.



## అరేబియా పరిస్థితులు- దైవప్రవక్త(స) తీరు

అరేబియా పరిస్థితులు మనకు తెలుసు. అక్కడ నూటికి నూరు శాతం దైవధర్మ వ్యతిరేకులే వుండేవారు. ఎటుచూసినా శత్రువులే శత్రువులు. మహా ప్రవక్త (స) ప్రాణాలు తీయడానికి, హత్య చేయడానికి వారు ఎదురుచూసేవారు. కాని వారు దారితప్పిన వారని దైవప్రవక్త(స) గ్రహించారు. వారిపట్ల సద్వ్యవహ రణ కలిగి ఉండాలని, ప్రేమతో కూడిన వ్యవహరణే వారిని సన్మార్గం వైపుకు తీసుకురాగలదని నిర్ణయించుకున్నారు. కనుక మానవాళిసేవకు ఏ అవకాశం దొరికినా దాన్ని ఆయన(స) వదలిపెట్టేవారు కాదు. అనాథల శిరస్సుపై నిమిరారు. వృద్ధులకు సేవచేశారు. పేదలకు సహాయం చేశారు. బాటసారులకు ఆశ్రయం కల్పించారు. అతిథులతో పూర్తి ఆతిథ్య ధర్మాన్ని పాటించారు. సాధారణ సంక్షేమ, అభివృద్ధి కార్యకలాపాలలో పాలుపంచు కున్నారు. నైతిక రుగ్మతలు అంటే దొంగ తనం, దోపిడీ, మోసగించడం, జూదం, మద్యపానం, వ్యభిచారం వగైరాలను రూపుమాపే ప్రయత్నం చేశారు. ఈ మార్గంలో తన ఆచరణ, నైతికత, తన నడవడిక తన సేవాభావం, ప్రేమలతో ప్రజల హృదయాలను జయించారు.

అంతేకాదు వారి స్వరూప స్వభావాల్నే మార్చివేశారు. అంటే ఇప్పటివరకూ వ్యతిరేకిస్తూ వచ్చినవారే ధార్మిక సిపాయిలయిపోయారు. నిన్నటివరకూ ద్రోహులు, దోపిడీగాండ్రు, హంతకులూ అయినవారే నేడు అపారమయిన నిష్టా పరులుగా, దైవానికి భయపడేవారుగా మారిపొయ్యారు.

బాగా గమనించినట్లయితే ప్రపంచంలో నేటికీ ఆ చెడుగులు ఉన్నాయి. అవే తారతమ్యాలు, అవే సంఘర్షణలు, అప్పుడు సంఘంలో వున్న కాలుష్యమే నేటికీ వున్నాయి. ఆ కాలంలో వున్న దోషాలే నేడూ వున్నాయి. కాని, షైతాన్ వారి పెడధోరణిని, వారి దృష్టిలో ఎంతో సుందరమైనదిగా చేశాడు. మనం చాలా మంచిపని చేస్తున్నాం అన్న వంచనకు వారు గురయ్యారు.

**వ జయ్యన లహుముష్షైతాను ఆమాలహుమ్ ఫసద్దహుమ్ అనిస్సబీలి వకానూ ముస్తబ్ సిరీన్** **(అన్ కబూత్: 38)**

“వారి పనులను షైతాన్ వారికొరకు చక్కనివిగా తీర్చిదిద్దాడు; వారిని సన్మార్గం నుండి తప్పించాడు. వాస్తవానికి వారు తెలివిగలవారే.”

ఇప్పుడు మనం చెయ్యవలసిందల్లా వారిలో నైతిక స్పృహను కలిగించడమే. ప్రస్తుతం సర్వసాధారణం అయిపోయిన అశాంతికి అసలు కారణం ప్రాథమిక నీతి సూత్రాలను వదిలివెయ్యడమేనని వారికి తెలుపాలి. జాలి, న్యాయం, సత్యత, వాగ్దానం నెరవేర్చడం, సేవ, హరాం, హలాల్‌ల విచక్షణ- ఇవన్నీ ఎటువంటి ఆచరణలు అంటే, ప్రజలు ఎప్పుడు వాటిని తిరస్కరిస్తారో అప్పుడే జీవితంలో శాంతి అంతమయి పోతుంది. సమాజంలో దోషాలకు దోషాలే పెల్లుబుకుతాయి. ఈ విషయాన్ని ముస్లిమేతరులూ అంగీకరిస్తారు. మనం ఈ స్పృహను మరికాస్త రేకిత్తించాలి. వాస్తవంగా నైతిక పతనం కారణంగానే ఈనాడు అశాంతియుత వాతావరణం విస్తరిస్తూపోతోందని తెలపాలి.

## ముస్లిమేతర సమాజం, భావనల పరిశీలన

దానితోపాటుగా ధర్మసందేశ కార్యం చేపట్టేముందు, మనం ముస్లిమేతర సమాజాన్ని, దాని భావనలను పరిశీలించాలి. ఈ దేశం మొదటి నుండి మత భావనల దేశం. ఇక్కడి ప్రజలలో దైవభావన, పరలోక భావన రెండు కూడా ఏదో ఒక రూపంలో కానవస్తాయి. కాని ఏళ్ళతరబడి తప్పుడు విద్యాశిక్షణల



కారణంగా వాటికి మకిలి పట్టింది. వాటి సారాంశం కూడా వికటించబడింది. ఒక సందేశదాతగా మనం వారి నమ్మకాలు, మతభావనలు, జాతీయ ఆచారాలను లోతుగా అధ్యయనం చెయ్యాలి. వారి పెద్దలు, ధార్మిక రుషులు, మునుల మంచిపనుల్ని గుర్తుంచుకోవాలి. ఇంకా వీలయితే నోట్ చేసుకోవాలి. తద్వారా సంభాషణ ఒక విశాల వాతావరణంలో చేయవచ్చు. వివిధ సందర్భాలలో మన హిందూసోదరులకు కొంతకాలంగా వారు మర్చిపోయిన వారి బోధనలను గుర్తుచేయాలి. గతించిన మహానుభావుల జీవితాలు, బోధనలలో కూడా చాలావరకు సంస్కరణ వుందని వారికి చెప్పవలసి వుంటుంది.

## రాజకీయ అపోహలను దూరం చేయడం

ఇంకా కేవలం మతపరంగా వారికి వాస్తవాలను వివరించడం చాలదు. రాజకీయపరంగా కూడా వారిని సంతృప్తపరచవలసి వుంటుంది. హిందూముస్లింల మధ్య కొన్ని అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నాయి అని చరిత్ర చెబుతోంది. వాటి దుష్ప్రభావం నేటికీ మిగిలివుంది. అందుచేత ఆ సంఘటనల కారణంగా జన్మించిన ఈర్ష్యా అసూయల్ని దూరంచేసి ముస్లిమేతరుల మనోమస్తిష్కాలను కళంకరహితం చేయడం ధర్మసందేశ కార్యంలోని మొదటి అంశం.

రాజకీయపరంగా హిందూ ముస్లింలు పరస్పరం ప్రత్యర్థులుగా వుండటం, సాంస్కృతిక, సామాజికపరంగానూ మరేవిధంగా కూడానూ సముచితం కాదు.

స్వాతంత్ర్యానికి పూర్వం బయటినుండి వచ్చిన ఆంగ్లజాతి ఈ దేశంలో పాలకవర్గం అయింది. హిందువులూ, ముస్లింలూ దానికి బానిసలు. “తగవులు పెట్టండి, పరిపాలించండి” అన్న సూత్రాన్ని అమలుపరుస్తూ ముస్లింల చరిత్రను వక్రీకరించి, దాన్ని వారు హిందూసోదరుల ఎదుట వుంచారు. హిందువుల గొప్ప వీరులను ముస్లిం పాలకుల తిరుగుబాటుదార్లుగా చిత్రించారు. తమ పాలసీ ద్వారా హిందూముస్లింలలో పరస్పర ద్వేషం చోటుచేసుకోవాలన్నది వారి ఆకాంక్ష. అంటే హిందూముస్లింలు పోట్లాడుకుంటూ వుంటే మనం వాళ్ళపై పెత్తనం చలాయించవచ్చని వారు పన్నాగాలు పన్నారు.

కాని ఆంగ్లేయులు భారత్‌ను విడిచివెళ్ళారు. మనం, మన సోదరులూ మన దేశంలో వుండవలసివుంది. కాబట్టి వెనుకటి అపోహలు దూరంచేయాలి. మన పెద్దల న్యాయశీలత, సామరస్యం, ప్రేమలతోకూడిన సంఘటనలు మన ఎదుటకు రావాలి. తద్వారా ప్రస్తుత వాతావరణాన్ని మార్చగలగాలి.

## ఆచరణ విధానం

మనం వారితో వాదోపవాదాలకు దిగడం లేదా ఏదో ఒక సమస్యపై జవాబు, ప్రతి జవాబుకు తలుపులు తెరవడం సరికాదు. వాదోపవాదాల వల్ల దుఃఖం, కోపం పుట్టుకొస్తాయి. గతంలో ఇలా జరుగుతూ వచ్చింది. దీనివల్ల ధర్మప్రచారానికి తీరని నష్టం వాటిల్లింది. ఇప్పుడు అన్నిచోట్ల ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ పద్ధతికి స్వస్తి పలకాలి.

మనం సత్యసందేశానికి అమానతుదారులం. ఇతరుల వరకూ దైవ సందేశం అందించడం, ఒక మహోన్నత లక్ష్యంవైపుకు ప్రజలను సమాయత్త పరచడం మన పని. అంతేకాని జగడాలకు దిగి ద్వేషం కలిగించడం కాదు. ప్రతి మనిషీ ప్రేమాదరణలు, శ్రేయోభిలాషా గుణం వ్యక్తమయ్యే విషయాన్ని సులభంగా అంగీకరించడానికి సిద్ధపడతాడు. సంభాషణ మనోరంజకంగా వుండి, ఎత్తిపొడుపుల ధోరణి విడనాడితే పరమ శత్రువుని కూడా మనతో ఏకీభవించే వానిగా చేసుకోవచ్చు.

## వాదోపవాదాలు విడనాడాలి

దైవప్రవక్త(స) తాయెఫ్‌కు ధర్మప్రచారం కోసం వెళ్ళినప్పుడు అక్కడి ధనవంతులు దైవప్రవక్త(స) వెనుక అల్లరి మూకలతో వెంటాడించి ప్రజల్ని రెచ్చగొట్టించారు. వారు ఆయన్ను దుర్భర కష్టాలకు గురి చేశారు. వారిలోనే అబ్ద్ యాలైల్ అనేవాడు పరమ కోపిష్టి. దుందుడుకు స్వభావి. హిజ్రత్ తర్వాత అతడు తన వెంట ఒక వర్గాన్ని వెంటబెట్టుకొని మదీనాకు వచ్చాడు. ముస్లిం కావటానికి ముందు అతడు దైవప్రవక్త(స) ఎదుట మూడుషరతులు పెట్టాడు. ఆ షరతులు పరిహాసాన్ని కల్గించేమాటలు. కాని దైవప్రవక్త(స) అతడితో వాదనకు దిగలేదు మృదువుగా నచ్చచెప్పారు.



అతడుపెట్టిన షరతులు: మూడు సంవత్సరాల వరకూ 'లాత్'ను కూల్చరాదు. అదేవిధంగా అతడు, అతడి అనుచరులు తమను నమాజ్‌నుండి మినహాయించాలన్నారు. ఇంకా తమకోసం వడ్డీకి అవకాశం విడిచిపెట్టాలన్నారు. అంతేకాక సారాయి, వ్యభిచారాలకు అనుమతి కూడా ఇవ్వాలన్నారు. దైవప్రవక్త (స) తప్ప మరెవరయినా వుండివుంటే బహుశా వారికీ ఇస్లాంకూ మధ్య అగాధం ఏర్పడేదే. కాని సత్యసందేశదాత(స)కు ఈ విషయం తెలుసు. వాటితో శతాబ్దాల తరబడి వారికి సంబంధం వుంటే క్రమక్రమంగా వారీ అలవాటును మానుకో గలరు. వారు సంవత్సరాల తరబడి నడుస్తూ వచ్చిన మార్గాన్నుండి మరలింపడం అంత సులభంకాదు. ఏ ఆచార వ్యవహారాలయితే వారి నరనరాన జీర్ణించుకు పోయాయో వాటిని విడిచిపెట్టడానికి వారి దృక్పథాన్ని అర్థం చేసుకోవడం అవసరం. కాబట్టి ఆయన(స) వారికి, వారు చెప్పదలుచుకున్నదంతా చెప్పుకో వడానికి పూర్తి అవకాశాన్నిచ్చారు. వాదోపవాదాల ధోరణిని అవలంబించ లేదు. వారి హృదయాలకు పట్టిన జ్వరం దిగిపోయినప్పుడు దైవప్రవక్త(స) వారికి ఇస్లాం సందేశం వినిపించారు. దాన్ని వింటూనేవారు ముస్లింలయిపొయ్యారు.

ఒకరిని కించపరచడం అన్న ప్రశ్నే మనకు ఉండరాదు. అలాగే ప్రశ్నోత్త రాల బరిలో ఒకరి ఎదుట ఓటమిని అంగీకరించినందువల్ల మన లక్ష్యం నెరవేరదు. సత్కార్యాల్ని వ్యాపింపచేయడం, దైవదాసులను దైవాగ్రహం నుండి రక్షించడమే మన లక్ష్యం. ఇందుకోసం హృదయాలను చూరగొనాలన్న కాంక్ష, సంకల్పం మనలో ఉండాలి. చిత్తశుద్ధి, నైతికతలు దీనికి అవసరం. రెచ్చగొట్టే ధోరణి, అనవసరమైన మొండివాదన, వాదోపవాదాలు, మంచి విషయాలు కావు. వాస్తవం ఏమంటే;

ఎదుటివారు వక్రధోరణిని అవలంబించినా సత్యసందేశ ప్రచారం చేసేవ్యక్తి మృదువుగా, శాంతియుతధోరణిని అవలంబించాలి. మానవాళికం తటికీ గొప్పవైద్యుడు అయిన హజ్రత్ ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు:

**"బష్షిరూ వలా తునఫ్ఫిరూ'**

''శుభవార్తనివ్వండి, ద్వేషాన్ని రగల్చకండి''

మధురభాషణ, నిరంతర ఆచరణ, చిత్తశుద్ధి, తప్పక ప్రభావం

చూపుతాయి. మన ఎదుటివాడు ఏదో ఒకరోజున శ్రద్ధగా ఆలోచించనారంభిస్తాడు. ఇదే మన సఫలతకు నిదర్శనం. దోరమగ్గినపండు ఏదో ఒకనాడు మీ జోలెలో పడగలదు. మనం సంబంధాలు నెలకొల్పే సమయంలో మీరు ఉపయోగించిన యాంత్రిక పదజాలం ప్రభావమే ఇది. వ్యతిరేకి అయినవాని హృదయంనుండి పంతం, వ్యతిరేకత తొలగిపోవడం, మృదువైఖరి, ప్రేమాదరణలతో కూడిన వ్యవహార ఫలితమే. అల్లాహ్, తన ప్రవక్త హజ్రత్ మూసా (అలై)ను ఫిరౌన్‌వంటి దుష్టుడు, క్రూరుడు అయిన పాలకునివద్దకు పంపేటప్పుడు చేసిన హితబోధ వాస్తవికత ఇది.

**ఇజ్‌హబా ఇలా ఫిర్‌ఔన ఇన్నాహూ తగా, ఫఖూలా లహూ ఖౌలల్లయ్యినల్ ల అల్లహూ యతజక్కరు అవ్ యఖ్‌షా. (తాహా: 43,44)**

**అనువాదం:** మీరు ఇద్దరూ కలసి ఫిరౌన్ వద్దకు వెళ్ళండి, అతడు ధిక్కారి అయిపోయాడు. అతనితో మృదువుగా మాట్లాడండి, బహుశా అతడు హితబోధను స్వీకరిస్తాడేమో లేదా (దేవునికి) భయపడతాడేమో.''

## జాతి, వర్గ సందేశం మానండి

వాస్తవానికి, మనిషి తనను ఒక ప్రత్యర్థిగా భావించుకున్నప్పుడే వాదోపవాదాల స్పిరిట్ పుట్టుకొస్తుంది. ఈ రోజుల్లో జాతి, వర్గ వైషమ్యాల భావన వేగంగా పూపందుకుంది. అదొక పీడగా దాపురించింది. ఆ కారణంగా జాతులకు జాతులకు మధ్య, దేశాలకు దేశాలకుమధ్య బాహాబాహీ పోరాటాలు జరుగుతున్నాయి. ఈర్ష్య, అసూయ, వైషమ్యాల అగ్ని అంతటా వ్యాపిస్తూ పోతోంది. ముస్లింలు కూడా కొంతకాలంగా ఈ వలయంలో చిక్కుకునివున్నారు. వాస్తవానికి సత్యసందేశకులకు ఇది శోభించదు. వారు వర్గ వివక్షతకు అతీతంగా ఉండి, ఇస్లాం ప్రతినిధిగా ప్రపంచం ఎదుటకు రావాలి. అతడు జాతితత్వపు మచ్చ ఏదీ లేనివాడయి పవిత్రుడుగా వుండాలి. వారి హృదయాల్లో అసూయ మచ్చుకైనా ఉండకూడదు. అల్లాహ్ సెలవిచ్చాడు:

''ప్రాణులన్నీ దేవుని కుటుంబమే''

దీన్నిబట్టి ప్రపంచంలోని ప్రతి మానవుడూ, అతడు యూరప్ వాడయినా



లేక పశ్చిమదేశాల పౌరుడయినా చిన్నవాడయినా, పెద్దవాడయినా, నల్లవాడయినా, తెల్లవాడయినా అతడు మన ఆదరణకు అర్హుడు.

**సూరయె నిసాలో ప్రత్యేకించి చెప్పబడింది:**

**వ- బుదుల్లాహ వలా తుష్రికూబిహీ షైఅవ్వ్‌బిల్‌వాలిదైని ఇహ్‌సానవ్ వ బిజిల్‌ఖుర్‌బా వల్ యతామా వల్ మసాకీని వల్‌జారి జిల్ ఖుర్‌బా వల్‌జారిల్ జునుబి వస్సాహిబిబిల్‌జమ్‌బి వబ్నిస్సబీలి వమా మలకత్ అయ్‌మానుకుమ్. (నిసా: 36)**

**అనువాదం:** మీరంతా అల్లాహ్‌కు దాస్యం చెయ్యండి. ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చేయవద్దు. తల్లిదండ్రుల ఎడల సద్భావంతో మెలగండి. బంధువులూ, అనాథలూ, నిరుపేదలపట్ల మంచిగా వ్యవహరించండి. పొరుగున ఉన్న బంధువులు, అపరిచితులయిన పొరుగువారు, ప్రక్కనున్న మిత్రులు, బాటసారులు, మీ ఆధీనంలో ఉన్న దాసదాసీజనం పట్ల ఉదారబుద్ధితో వ్యవహరించండి.

ఇక్కడ 'వల్‌జారిల్ జునుబి' అంటే ఎటువంటి బంధుత్వంగానీ, జాతి సంబంధంగాని ఏమీలేని పొరుగువారు అని అర్థం. ఇందులో ముస్లిమేతరులైన పొరుగువారూ వున్నారు. కష్టాలలో వున్నవారిని ఆదుకోవడం దారితప్పిన వారికి దారిచూపడం, గాయపడినవారిని పరామర్శించడంలో ముస్లింలు, ముస్లిమేతరులు అన్న విచక్షణలేదు. ప్రస్తుత రాజకీయ సంఘర్షణ, ఆర్థిక దుస్థితి పరస్పర వైరం పట్ల మనలాగే ముస్లిమేతర పొరుగువారు కూడా ఆందోళన పడుతున్నారు. ఇటువంటి విపత్కరకాలంలో ప్రేమతో కూడిన రెండు మాటలు పలికితే, జాతితత్వ వలయాన్నుండి ఉన్నతులై వారిని అక్కున చేర్చుకుంటే వారి దుఃఖబాధల్లో పాలుపంచుకుంటే మన కోసం వారి హృదయాల్లో చోటు లభిస్తుంది. ఆ తర్వాత మన మాటను వారి నోట జారవేయగలం.

ఈ సందర్భంగా, ఈనాటి వైఫల్యాలకు అసలు కారణం మనిషి దైవాన్ని విస్మరించడమేనని, మతాన్ని మరచిపోవడమేనని, వాస్తవానికి మతానికి జీవితంతో నేరుగా సంబంధముందని, మతానికి మాత్రమే మనిషిని మానవునిగా మలిచే శక్తిగలదనీ, లేకుంటే మనిషి పశువుకన్నా హీనుడు అని, ఇప్పుడు మనం

ఈ స్థాయినుండి పైకి ఎదగాలంటే ధార్మిక విలువలను జీవిత ప్రాతిపదికలుగా చేసుకోవాలని ప్రత్యేకించి ఇస్లాం చెడులను రూపుమాపే సూత్రాలను అందిస్తుం దని దానివల్ల సత్కార్యాలు వాటంతటవే వృద్ధి చెందగలవని వారికి చెప్పాలి. దానితోపాటుగా ఇస్లామీయ బోధనలపై ఎవరి గుత్తాధిపత్యమూ లేదనీ, గాలి, వెలుతురూ లభించే ఏర్పాటు అల్లాహ్ తరపునుండి మానవులందరి కోసమూ ఉన్నట్లే, ఇస్లామీయ జీవిత విధానం కూడా అందరి కోసమూ అని, ఈ వ్యవస్థ, దాని బోధనలు మానవ శ్రేయస్సుకు హామీనిస్తున్నాయని వారికి చెప్పాలి.

ఇంకా ఈ వ్యవస్థ ఏదయినా ఒక మతానికి, శక్తికి, వర్గానికి వ్యతిరేకి కాదనీ అది తప్పుడు సిద్ధాంతాలకూ అవాస్తవ దృక్పథాలకు వ్యతిరేకి. అది తన అనుచరులకు నైతికత, సత్ప్రవర్తన, న్యాయం, సత్యత, ధర్మనిష్ఠ, సన్మార్గావలం బనల్ని తమ జీవిత ఆచరణాసరళిగా చేసుకోండి, తాను ఎక్కడ వున్నప్పటికీ చెడును రూపుమాపే, మంచిని వ్యాపింపచేసే బాధ్యత ప్రతి ముస్లిం పైనా వుంది. మంచి వ్యాపించడంలో సత్కార్యం, సత్యత, న్యాయం, ధర్మవంత మయిన పనులు చేసినందువల్ల ముస్లింలు, ముస్లిమేతరులు అందరికీ ప్రయోజనం చేకూరగలదు.

## సందేశ వ్యాప్తిలో యుక్తి

మనల్ని సావధానులు చేయదల్చుకున్న రెండో విషయం మిశ్రమ జనా వాసాలలో సందేశ కార్యంలో ఉపాయశీలతను అవలంబించాలి. ఒక విషయం గుర్తుంచుకోండి. ప్రతి మనిషి అన్ని సమయాల్లో, ప్రతి విషయాన్నీ వినడానికి సిద్ధంగా ఉండడు. అందుకోసం తగిన సమయం, సందర్భం కోసం వేచిచూడాల్సి వుంటుంది. సరైన సమాయానికి చెప్పబడిన ఒక్క వాక్యం, ఒక్క కవిత, ఒక్క మాట పెద్దపెద్ద ధార్మిక బోధనలు, ఉపన్యాసాలకంటే ఎక్కువ ప్రభావం చూపుతాయి.

సత్యసందేశ మార్గంలో ఒక్కోసారి తీవ్ర వ్యతిరేకతలు పర్వతంలాగా దారికి అడ్డుపడతాయి. ఒక్కోసారి ప్రజలు తమ పదాన్నుండి తప్పుకోవడానికి ఇష్టపడరు. ఒక్కోసారి సత్యసందేశం వైపు పిలుపును వినీవిననట్లు ప్రవర్తిస్తారు. ఇటువంటి సందర్భాలలో వివేకంతో పనిచేసుకుపోవాల్సి వుంటుంది. ఇటువంటి



సందర్భాలు మనకూ ఎదురుపడవచ్చు. ఈ విషయాలు అనుభవంలోకి రాగలవు. వ్యతిరేకాభిప్రాయం గలవారిని మనం కలుసుకుంటాం. అటువంటి సమయాల్లో గొప్ప వివేచన అవసరం అవుతుంది. మీకు మార్గదర్శకత్వం కోసం హుదైబియా సంధి జరిగిన సందర్భాన్ని నకలు చేస్తున్నాం. ఈ విషయం మనకు తెలుసు. దైవప్రవక్త(స), ఖురైష్ సర్దారు సుహైల్ ఇబ్నె ఉమర్‌తో ఆ సందర్భంలో ఎంతో అణిగిమణిగి ఒప్పందం కుదుర్చుకున్నారు. హజ్రత్ అలీ(రజి) ఒప్పందం షరతుల్ని వ్రాయడానికి సిద్ధమయినప్పుడు, దైవప్రవక్త(స) ఆయనకు బిస్మిల్లాహ్ (అల్లాహ్ పేరుతో) వ్రాయమని ఆదేశించారు. కాని ఈ రహ్మాన్, రహీం (కరుణా మయుడు, కృపాశీలుడు) ఎవరో మేమెరుగము. మా అలవాటు ప్రకారం బిఇస్మిక అల్లాహుమ్మ అని వ్రాయాలి అన్నాడు సుహైల్. దైవప్రవక్త(స) అందుకు అంగీకరించారు తిరిగి అన్నారు, వ్రాయి, ఈ క్రింది ఒప్పందం- దైవప్రవక్త ముహమ్మద్ (ముహమ్మద్ రసూలుల్లాహ్) మరియు సుహైల్ బిన్ ఉమర్‌ల మధ్య తీర్మానించబడింది. సుహైల్ బిన్ ఉమర్ తిరిగి వెంటనే అన్నాడు, "మీరు దైవప్రవక్త అని నేను ఎరిగి వుంటే మీతో ఎందుకు తగవు పడతాను? కనుక మీ పేరు, మీ తండ్రిపేరు వ్రాయండి." హజ్రత్ అలీ(రజి) ముహమ్మద్ రసూలుల్లాహ్ అన్న పదాలను అప్పటికే వ్రాసేశారు. ప్రవక్త పట్ల విధేయత కారణంగా తన చేత్తో ఆ పదాలను కొట్టివేయదలచుకోలేదు. దైవప్రవక్త(స) వ్రాయబడిన ఆ పదాలను స్వయంగా కొట్టివేశారు. వాటి స్థానంలో ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (అబ్దుల్లాహ్ కుమారుడు ముహమ్మద్) అని వ్రాశారు.

సుహైల్ బిన్ ఉమర్ ఆగడాలకు సహబెఅక్రామ్ (ప్రవక్త అనుచరులు) (రజి) ఆవేశంతో ఊగిపోతున్నారు. కాని సందేశ దాత (స) వివేచనతో కూడిన విశాల దృక్పథం కలిగి ఉన్నారు. ఈ వివేచనాపూర్వక క్రియాఫలితాలు ఒకేఒక్క సంవత్సరంలో ఎంత బ్రహ్మాండమైన రీతిలో అందివచ్చాయో చరిత్రపై దృష్టి సారించే వారికి తెలుసు. మక్కాలోని రాతినేల జయించబడింది. నూరుశాతం వ్యతిరేకులు ఉన్న ప్రాంతంలో విప్లవాత్మక మార్పు వచ్చి, నూరుశాతం అనుకూలురు అయ్యారు. ఏ సుహైల్ బిన్ ఉమర్ అయితే హుదైబియా ఒప్పందం సమయంలో రొమ్ము విరుచుకుని వ్యవహరించాడో, ముఖం తిన్నగా

పెట్టుకొని మాట్లాడేవాడు కాదో అతడే చివరకు దైవప్రవక్త(స) అనుసరణలో వచ్చి చేరాడు. ఖాలిద్ బిన్ వలీద్, ఉమర్ బిన్ అల్ ఆస్ ఇద్దరూ ప్రవక్త(స) పట్ల వ్యతిరేకతలో ముందు వరుసలో వున్నవారు కాస్తా ఉపాయంతో గల మెతక ధోరణి వివేచనాభరిత పాలసీ కారణంగా దైవప్రవక్త(స)కు అంగరక్షకులయి పొయ్యారు.

ఈ నేపథ్యాన్ని మీరు గమనించినట్లయితే, దైవప్రవక్త(స) ఎదుట ఒక లక్ష్యం వుందని, ఆ లక్ష్యసాధన కోసం అంకుఠిత దీక్ష వుందనీ, ఆదం సంతతిని నరకంనుండి కాపాడాలన్న తపనవుందనీ తెలుస్తుంది. ఆ సమయంలో కూడా ఎన్నో తాత్కాలిక సమస్యలున్నాయి. కాని వాటిని ఆయన(స) లక్ష్యంగా చేసుకో లేదు. తాత్కాలిక వ్యవహారాల్లో ఆయన(స) కాలం గడపలేదు. తౌహీద్, ఆఖిరత్‌ల భావనను ముందుంచారు. చెడును రూపుమాపడానికి ప్రాధాన్యత నిచ్చారు. ఆ తర్వాత సమాజం యావత్తూ ఆందోళన చెందుతున్న ఇతర సమస్యలు కూడా తీరిపొయ్యాయి. ఈ కాలంలో కూడా ఆ విధానంలో మార్గదర్శకత్వం వుంది. వివిధ సమస్యలు తలెత్తుతున్నాయి అన్నది నిజమే. ఎదుటివాని మాటలకు మనసు కలుషితం అయ్యే మాటా నిజమే. కాని తాత్కాలిక సమస్యలు లక్ష్యం స్థానాన్ని ఆక్రమించలేవన్నది వాస్తవం. కోట్లాది మానవులు నరకానికి ఇంధనం కాబోతున్నారు. వారిని ఆ మార్గం నుండి తప్పించి, ఒక్కడూ, సహవర్తులు ఎవరూ లేనివాడయిన అల్లాహ్ మార్గాన్ని చూపడం ముస్లింల జీవిత లక్ష్యం అన్న విషయం మనం శ్రద్ధగా పరిశీలించాలి. ఈ మార్గంలో ఎటువంటి శ్రమకు గురికావలసి వచ్చినా, ఎదుటివాని నుండి పరుష వాక్కులు వినవలసి వచ్చినా లేక మనసుకు నచ్చని వ్యవహారం జరిగినా మన గొప్ప లక్ష్యం కోసం ఏ విషయానికీ నొచ్చుకోరాదు. మనస్సును మాలిన్య వంతం చేసుకోకూడదు.

ఒక విషయం గుర్తుంచుకోవాలి. ప్రతి జాతి వ్యక్తులకూ తమ నమ్మకాలు, ఆచారాలతో ఏ కాస్త అయినా సంబంధం, అనుబంధం వుంటుంది. పొరపాటున కూడా వారికి వ్యతిరేకంగా ఏదయినా మాట మన నోట వెలువడినట్లయితే ఎదుటివాని దురభిమానం పెల్లుబికి మమ్మల్ని నానామాటలు అనవచ్చు. దానికి



మనం సత్యప్రియత్వంలో ఏదయినా తప్పటడుగు వేయవచ్చు. ఈ పద్ధతి యుక్తికి వ్యతిరేకమైనది. అందుచేతనే అల్లాహ్ తన వాణిలో సత్యసందేశ దాతలకు దీనికి దూరంగా వుండాలని తాకీదు చేశాడు.

**వలా తసుబ్బుల్లజీన యద్‌వూన మిన్‌దూనిల్లాహి ఫయసుబ్బుల్లాహ అద్‌వమ్ బిగైరి ఇల్మ్. కజాలిక జయ్యన్నా లికుల్లి ఉమ్మతిన్ అమలహుమ్. (అల్‌అన్‌ఆమ్ 108)**

**అనువాదం:** వారు అల్లాహ్‌ను కాదని వేడుకునే ఇతరులను దూషించకండి. ఎందుకంటే, వారు షిర్కుకంటే ఇంకా ముందుకుపోయి అజ్ఞానం చేత అల్లాహ్‌ను దూషిస్తారేమో. ఈ విధంగానే మేము ప్రతివర్గం వారికి వారు చేసే పనులు ఆకర్షవంతంగా ఉండేలా చేశాము.

యుక్తి కోరేది ఈ విషయాన్నే. ఈ విషయంలో పెద్దలు గొప్ప లక్ష్యం అంటే ధర్మసందేశం అందించడానికి మన పెద్దలు యుక్తిగా వ్యవహరించిన సంఘటనలు ఎన్నో మనకు తెలుసు. వారు తమ స్థాయినుండి ఒక మెట్టు దిగి పనిచేశారు. అందుకు సరయిన లాభం పొందారు.

హజ్రత్ అలీ(రజి)కి సంబంధించిన ప్రసిద్ధ సంఘటన. ఆయన యుద్ధ సమయంలో ఒక శత్రువును క్రింద పడదోశారు. అతడిని సంహరించాలనుకున్నారు. అతను హజ్రత్ అలీ(రజి) ముఖంపై ఉమ్మివేశాడు. హజ్రత్ అలీ(రజి) వెంటనే అతడి గుండెలపైనుండి పైకి లేచారు. కరవాలాన్ని ఒరలో పెట్టుకున్నారు. కోపావేశంలో అతడ్ని వధించలేదు. ఉమ్మినందున తనకు కోపం కలిగి విరోధినిని వధిస్తే అది దైవమార్గంలో చేసిన సంహరణ కాదు. వదలివేయబడిన వ్యక్తి ఆ విషయం గ్రహించాడు. ముస్లిం అయిపోయాడు. హజ్రత్ అలీ(రజి)గనుక కోపంలో అతడ్ని వధించివుంటే ఈ ఫలితం దక్కేదికాదు. ఇది ఎంతో దూరదృష్టితో చేసిన పని ఫలితం.

దివంగత మౌలానా ముహమ్మద్ అలీ గారి దగ్గరకు ఒక పాకీపనివాడు వస్తూవుండేవాడు. మౌలానా గారు అతనితో ఎప్పుడూ ఆదరంతో వ్యవహరించే వారు. కాకతాళీయంగా అతడు ఒక రోజున భోజన సమయానికి వచ్చాడు. మౌలానా మనసు వుండబట్టలేకపోయింది. అతడు లేకుండా భోజనం చేయడం

ఆయనకు సహించరాని విషయం అయింది. కనుక ఆయన "హర్‌చంద్ భాయీ! భోజనం వేళ అయింది. చేతులు కడుక్కునిరా నాతో కలిసి భోంచేద్దువుగాని" అన్నారు. అతడు మొదట తటపటాయించాడు. మౌలానా బలవంతం చేయగ సిద్ధపడ్డాడు. మౌలానా స్వయంగా నీళ్ళుపోసి అతని చేతులు కడిగించారు, పట్టుకొని తన దగ్గర కూర్చోబెట్టుకున్నారు. ఇస్లాంలో అధికులు, అల్పులు అన్న భావన లేదు. మానవత్వ సంబంధం కారణంగా నీవు మా సోదరుడివే. ఈ మాటలకు ప్రభావితుడయిన అతడు కలిమా పఠించి ముస్లిం అయిపోయాడు.

మరో సంఘటన. హజ్రత్ షా వలియుల్లా(రహ్మలై)కి సంబంధించినది. షాసాహెబ్ ఢిల్లీ రావడానికి ఇంటినుండి ఎద్దులబండిలో ప్రయాణానికి సిద్ధం అవుతున్నారు. బండి తోలేవాడు హిందువు. షాసాహెబ్ దైవభక్తిపరుడు, నమాజు వేళకు నమాజ్ చేసేవారు. ఇతర సమయాల్లో దైవనామస్మరణలో నిమగ్న మయ్యేవారు. ఇంకా సమయం దొరికినంతమేర బండివానికి ఇస్లాంకు సంబంధించి మంచి మంచి విషయాలు తెలిపేవారు. ఆయన బండివానిని తనతో కూర్చొబెట్టుకొని భోజనం చేయించేవారు. దారి పొడవునా అతడ్ని బాగా చూసుకున్నారు. బండివాడు ఆయన సద్బుద్ధికి ఎంతో ఆకర్షితుడయ్యాడు. ఢిల్లీ చేరుకున్నాక ఆయన అతడ్ని తిరిగి వెళ్ళమన్నారు. అయ్యా నన్ను తమ సేవలోనే ఉండనీయండి అని అతడు కోరాడు. ఇక నేను అజ్ఞానంలోకి తిరిగి వెళ్ళను అని అతడు షాసాహెబ్ చేతుల్లో ముస్లిం అయ్యాడు.

మన పెద్దల అనుభవంలోకి వచ్చిన ఇటువంటి వేలాది సంఘటనలు ఉన్నాయి. వాటి ద్వారా వందలాది మంది జీవితాలు తీర్చిదిద్దబడ్డాయి. ఈనాటికీ చిత్తశుద్ధితో, యుక్తితో మనసులను చూరగొనే చిట్కాలను ఉపయోగించి నట్లయితే అంధకారంలో పడివున్న ఎన్నో ఆత్మలు వెలుగులోకి రాగలవు. మన దేశం సువిశాల దేశం. దేశవ్యాప్తంగా అంటరానివారు, హరిజనులు ఇంకా ఎన్నో వెనుకబడిన జాతుల వారు నివసిస్తున్నారు. నేడు వారు పైకి రావాలను కుంటున్నారు. కాని మన సమాజంలోని బంధనాల కారణంగా వారు అర్హులయి నప్పటికీ ఇప్పటి వరకు వారికి ఆ స్థానం లభించలేదు. గనక వారికి దగ్గరగా ఖుర్‌ఆన్ సందేశాన్ని తీసుకువెళ్ళినట్లయితే చాలా మంచి ఫలితాలు లభించగలవు.



## బస్తీ పరిశీలన

ఈ పనికోసం మనం మన బస్తీ చిత్రాన్ని రూపొందించుకోవాలి. అందులో ఏయే వర్గం, ఏయే మతాలవారు ఎంతమంది వున్నారు? విద్యావంతులు ఎంతమంది ఉన్నారు? వివిధ ప్రజల వ్యాపకాలు ఏమిటి? వారి అభిరుచులు ఏమిటి? వారి సమాజంలో ఏయే పండుగలు జరుపుకుంటారు? ఆచార వ్యవహారాల పాటింపు ఏ మేరకు వుంది? ఇంకా వారి సమయం ఎంతసేపు వృధాగా గడుస్తుంది? అన్న పరిశీలన ముందుంచుకుని పనిచేస్తే సందేశ కార్యంలో ఎంతో సహాయకారి అవుతుంది.

ఇది బాహ్యాపరమైన తయారీ. ఒక సందేశదాత ఏ వాడకట్టులో ఉంటున్నాడో, ఏ వర్గ ప్రజలకు చేరువగా వుంటాడో వారితో సంబంధ బాంధ వ్యాలను పెంచుకోవాలి. పరస్పర సంబంధాలను విస్తృతం చేసుకోవాలి. వారి వివాహాలు, మరణాల సందర్భాలలో తమ సేవలను చిత్తశుద్ధితో అందించాలి. వారిని తమ ఇళ్ళకు ఆహ్వానించాలి. తమ ఇళ్ళలోని విందులకు వారిని పిలవాలి. ఈవిధంగా అందరినీ కలుసుకునే అవకాశాలు తీసుకోవాలి. మనస్సులను చూరగొనే ఉత్తమ చిట్కా ఇది.

## సంస్కరణా కార్యకలాపాలలో భాగస్వామ్యం

ఈరోజుల్లో ప్రతి బస్తీలో సంస్కరణా కార్యకలాపాలు జరుగుతున్నాయి. సామాజిక సేవాభావం వెల్లివిరుస్తోంది. పంచాయితీ సిస్టం, గ్రామాభివృద్ధి, బస్తీల పారిశుధ్యం, పరిశుభ్రత, జాతీయ సమైక్యత వంటి పథకాలు అమలు జరుపబడుతున్నాయి. ఇటువంటి పనుల పట్ల దృష్టి సారించాలి. వాటిల్లో పాలుపంచుకోవాలి. సమయం, సందర్భాన్నిబట్టి తమ దృక్పథాన్ని వివరించాలి. దైవప్రవక్త(స) అరబ్ ప్రజలకు శాంతిభద్రతలు కరువు అవడం గమనించారు. రహదారులు దోషభూయిష్టాలయి ఉన్నాయి. బాటసారులు దోచుకోబడు తున్నారు. పేదలపై అన్నివైపులనుండి దౌర్జన్యం జరుగుతోంది. అందుకని ఆయన(స) మక్కావారితో కలిసి ఆ చెడుగులను రూపమాపడానికే ఒక సంఘాన్ని ఏర్పాటు చేశారు. దానివల్ల తగినంత ప్రభావం పడింది.

ఇదేవిధంగా మనం కూడా ప్రజల సేవ కోసం మన బస్తీలో సంక్షేమ కార్యాలు చేయడానికి ఎన్నో అవకాశాలు పొందగలం. ఇటువంటి సందర్భాల్లో ప్రేమాదరణలతో, మనసులను చూరగొనే పద్ధతినవలంబించి, హిందూ ముస్లిం అన్న విచక్షణ లేకుండా, రోగులను పరామర్శించడం, ఆకలితో వున్నవారికి అన్నం పెట్టడం, అంధులకు దారిచూపడం, వస్త్రహీనులకు వస్త్రధారణ చేయించడం వంటి పనులు చేస్తున్నట్లయితే ప్రతివారి హృదయ కవాటాలు మన మాటలు వినడానికి తెరుచుకుంటాయి.

## ఉమ్మడి అంశాల గుర్తింపు

ఈ సందర్భంగా వారి మత ఆచారాలను కూడా వినాలి. వాటిల్లో చాలా విషయాలు, ఇస్లామీయ బోధనలే అపక్రమ రూపంలో లభిస్తాయి. ఈ విషయం, ఇస్లాంలో ఇలా వుంది, ఈ అంశాలు మాకూ మీకూ మధ్య ఉమ్మడి విషయాలు. మూలసూత్రాలలో పరస్పర విభేదం లేదు అని వారికి చెప్పాలి. ఉమ్మడి అంశాలపై ప్రజాభిప్రాయాన్ని మలచే వైపు దివ్యఖుర్ఆన్‌లో కూడా సూచించబడింది.

**ఖుల్ యా అహ్‌లల్‌కితాబి తఆలౌ ఇలా కలిమతిన్ సవాఇమ్ బైననా వ బైనకుమ్ అల్లా నబుద ఇల్లల్లాహ వలా నుష్రిక బిహీ షయ్అన్‌వ్వలా యత్తఖిజ బ'జునా బ'జన్ అర్‌బాబమ్మిన్‌దూనిల్లాహ్. ఫఇన్ తవల్లవ్ ఫఖూలుష్‌హదూ బిఅన్నా ముస్లిమూన్. (ఆలి ఇమ్రాన్: 64)**

"ప్రవక్తా! ఇలా చెప్పు: "గ్రంథ ప్రజలారా! మాకూ మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది." ఈ సందేశాన్ని స్వీకరించటానికి వారు వైముఖ్యం కనబరిస్తే, వారితో స్పష్టంగా ఇలా అను: "మేము ముస్లిములము (కేవలం అల్లాహ్‌కే దాస్యం చేసేవారు, విధేయత చూపేవారు) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి."

అల్లాహ్ ఒక్కడే అని అంగీకరించడం, అల్లాహ్ ఒక్కడే అని తెలుసు



కోవడం, ఆయననే సృష్టికర్తగా, యజమానిగా, ఆరాధ్యునిగా, పాలకునిగా భావించడం అనే దాన్ని ముస్లిమేతరులు కూడా ఏదో ఒకవిధంగా అంగీకరిస్తారు. లేదా అంగీకరించవచ్చు. అందుచేత ఈ ఉమ్మడి ప్రాతిపదిక వైపు ఆహ్వానించమని అల్లాహ్ ఆదేశిస్తున్నాడు. మనం ఈ విషయంలో నోటిమాట ద్వారా తెలియపర్చవచ్చు. ఇంకా దినపత్రికలు, సందేశ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని వ్రాయబడిన కరపత్రాలు, చిన్నచిన్న పుస్తకాల ద్వారా లబ్ది పొందవచ్చు.

ఇవేకాకుండా వివిధ సందర్భాలలో ఇటువంటి సమావేశాలు, సభలు ఏర్పాటుచేసి ప్రజలను ఆహ్వానించవచ్చు. ఉదాహరణకు ముషాయిరాలు, సాహిత్యసభలు, విద్యాప్రదర్శనలు, మతసమావేశాలు ఈ పనిలో సహాయకారులు కాగలవు. అప్పుడప్పుడూ ఈనాడు దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, ఆకలి, దారిద్ర్యం, దౌర్జన్యం, అజ్ఞానం, వడ్డీ, లంచం, అధికులు, అల్పులు, సామరస్య రాహిత్యం, దైవాన్ని గుర్తించకపోవడం, నైతిక బలహీనతలు మొదలగు అంశాలపై సింపోజియం ఏర్పాటు చేయండి. తద్వారా ఇస్లాం యొక్క సంస్కరణా కార్యక్రమం ప్రజల ఎదుటకు రాగలదు.

పాత తరానికి చెందిన కొందరు పెద్దలకు ఇటువంటి వ్యాపకాలు భరించరానివిగా తోచవచ్చు. ఏళ్ళతరబడి ధర్మం గురించి పరిమిత భావన ప్రజల హృదయాల్లో గూడుకట్టుకొని వుంది. కనుక వారు ఆలోచించకుండానే ఎక్కడి సింపోజియాలు, ఏమి ధర్మప్రచారం అనుకుంటారు. కాని గుర్తుంచుకోండి, ఇటువంటి సమావేశాల వల్ల మన లక్ష్యం కాలక్షేపం కాదు. పైగా వాటి ద్వారా ప్రజల్ని మన సందేశం వైపు సావధానులు చేయడం. వారి హృదయాల్లో ఇస్లాం సందేశాన్ని నింపడం. ఈవిధంగా దైవం సద్బుద్ధినిస్తే ఒక్క మనిషి అయినా మన మాటను అంగీకరిస్తే లేదా తన దృక్పథాన్ని మార్చుకోవడానికి సిద్ధపడితే మన ఇరువురి పరలోకం చక్కబడినట్లే. దైవప్రవక్త(స) ఒకసారి హజ్రత్ అలీ(రజి)తో అన్నారు:

"నీ ద్వారా ఒక్క మనిషి అయినా సన్మార్గానికి మరలితే, అది వంద ఎర్రని ఒంటెల కన్నా ఉత్తమం."

ఒక మనిషి అంధకారంలో జీవితం గడుపుతున్నాడు. కుఫ్ర్ (దైవ తిరస్కారం) షిర్క్ (బహుదైవారాధన)ల ఊబిలో చిక్కుకుని, ధర్మ వ్యతిరేక కార్యాలలో అతడి జీవితం గడిచిపోయి, హలాల్ ఏదో హరామ్ ఏదో పవిత్రత, అపవిత్రతల విచక్షణ లేకుండా పోయినప్పుడు మనం అతని హృదయంలో ధర్మజ్యోతిని వెలిగిస్తే దారి తప్పిన అతని ఆత్మను అతడి సృష్టకర్త గడపవరకు తీసుకువస్తే, ఇది ఎంత గౌరవప్రద కార్యం! సహీహ్ ముస్లిం హదీసు గ్రంథంలో ఈమాటనే ఇలా వివరించడం జరిగింది.

దైవప్రవక్త(స) సెలవిస్తున్నారు, ''సన్మార్గంవైపు ఆహ్వానించినవానికి, ఆ సందేశం వైపుకు మరలినవారందరి పుణ్యానికి సమానంగా పుణ్యం లభిస్తుంది. దానివల్ల వారి పుణ్యంలో ఏమీ తగ్గించడం జరగదు. ఇంకా అజ్ఞానం వైపుకు పిలుపునిచ్చినవానికి, దాన్ని అనుసరించినవారందరి పాపానికీ సమానమయిన పాపం లభిస్తుంది. దానివల్ల వారి పాపాలను ఏమాత్రమూ తగ్గించడం జరుగదు.''

ఒక విషయం దృష్టిలో వుండివుండవచ్చు. ప్రపంచంలో ప్రతి మనిషి అజ్ఞానం వైపుకయినా లేక సన్మార్గంవైపుకు దైవధర్మం వైపుకయినా ఆహ్వానిస్తాడు. స్వయం కల్పిత వ్యవస్థలు, చట్టాలు, ప్రభుత్వ రాజ్యాంగాలు, తాతముత్తాతల ఆచార వ్యవహారాలు, ధర్మ వ్యతిరేకత, అశ్లీలతలు మరియు ప్రపంచ వ్యామోహం వైపుకు ప్రజల్ని ఎవరు పిలుస్తారో, ఆ మార్గాన్ని ఎవరు అనుసరిస్తారో వారి మాటలను విని తప్పుడు మార్గాలను అనుసరించిన వారందరిపై ప్రజలను దారితప్పించిన నేరం మోపబడుతుంది.

తద్భిన్నంగా దైవదాస్యం, ప్రవక్తల అనుసరణ సత్యధర్మానుసరణ వైపు పిలిచిన వానికి ఆ సందేశాన్ని స్వీకరించినవారందరి, ఆ సందేశానికి ప్రభావితులయిన వారందరి ప్రతిఫలానికి సమాన ప్రతిఫలం లభిస్తుంది. అంటే ఒక వ్యక్తి చేసిన సందేశకృషి ఫలితంగా కొందరు ముస్లిమేతర సోదరులు ఇస్లాం స్వీకరించినా లేక ఏమారివున్న కొందరు ముస్లింలు అల్లాహ్ వైపుకు మరలి, వారు సజ్జనులయిపోతే సందేశదాతకు తన పుణ్యం, ప్రతిఫలంతోపాటు, వారందరి విశ్వాసం, సౌజన్యతల ప్రతిఫలం, అతని వాటాలోకి వస్తాయి.



ఈ హదీసు వెలుగులో, ముస్లిమేతర సోదరులు ఇస్లాంకు దగ్గర అయ్యేలా, ఇస్లాం బోధనల్ని గ్రహించగలిగేలా తీవ్ర ప్రయత్నం చేయడం మన అందరి విధి.

ఈనాడు మానవుడి ఏమరుపాటు హద్దుమీరిపోవడాన్ని మనం చూస్తున్నాం. బహిరంగంగా అతడు దైవంపై తిరుగుబాటు చేస్తున్నాడు. లంచం, వడ్డీ, సిగ్గుమాలినతనం, దైవతిరస్కారం, నాస్తికత్వం రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. మన దేశంలో కూడా ఇదే పరిస్థితి నెలకొని వుంది. ఇటువంటి సమయంలో మనం ఏమరుపాటు వహిస్తే చూస్తూ చూస్తూ ప్రజలను వినాశంవైపు పోవడాన్నుండి ఆపకపోతే దాని పర్యవసానం తీవ్ర వినాశకరం కాగలదు. చరిత్రనుండి మనం గుణపాఠం గ్రహించాలి. ఎన్ని నగరాలు తలక్రిందులు చేయబడ్డాయో, ఎందరు మానవులు తమ కర్మల కారణంగా నశింపచేయబడ్డారో, ఎన్ని జాతులు దైవాన్ని విస్మరించిన కారణంగా గుణపాఠపు నమూనాలుగా తయారయ్యాయో ఆ పరిణామాలను సూచిస్తూ పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ సెలవిస్తున్నాడు:

''పాపాల పుట్టలైన ఎన్నో జనపదాలను మేము నాశనం చేశాము. ఈనాడు అవి తమ కప్పులపై తలక్రిందులుగా పడిఉన్నాయి. ఎన్నో బావులు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎన్నో ఎత్తయిన భవనాలు శిథిలాలుగా మారిపోయాయి. వారు భూమిపై సంచరించలేదా వారి హృదయాలు అర్థం చేసుకోగలవిగా, వారి చెవులు వినగలగవిగా కావటానికి? యదార్థం ఏమిటంటే కళ్ళు గుడ్డివి అవవు. కాని వక్షములలోపల ఉన్న హృదయాలు మాత్రం గుడ్డివి అయిపోతాయి.'' (అల్ హజ్: 45, 46)

గోధుమలతోపాటు పురుగులు కూడా పిండికావటం మనం ఎరిగినదే. కాబట్టి మనలో కొందరు నమాజ్ చేసుకొనేవారుంటే మరికొందరు మతకర్మలు నిర్వహిస్తారు. కేవలం దీనితో సరిపెట్టుకుంటే, ప్రజలను అజ్ఞానమార్గాన్నుండి మరల్చకపోవడం అవుతుంది. ప్రతిఫలదినపు జవాబుదారీ నుండి మనల్ని అవి విముక్తం చెయ్యజాలవు.

**-: సమాప్తం :-**